క్లుప్తంగా

రైతు సంక్షేమానికి కృషి



పాలక మండలి సభ్యులను సన్మానిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

కడ్తాల్: రాజకీయాలకు అతీతంగా రైతు సంక్షేమానికి కృషి చేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ నరేశ్‌నాయక్‌లను స్థానిక నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడ్తాల్ మండల కేంద్రంలో మార్కెట్ ఔట్ పోస్టు స్థాయిని పెంచాలని సూచించారు. రైతులు ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు ప్రత్యేక గోదాం, ధాన్యం ఆరబెట్టుకోవడానికి కల్లాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు లక్ష్మణ్‌నాయక్, జహంగీర్‌అలీ, భిక్షపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఎస్‌ఐకి విరాళం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: నేర నియంత్రణ, నిందితుల పట్టివేత, బాధితులకు సత్వర న్యాయం అందజేయడంలో కీలక పాత్ర పోషించే సీసీకెమెరాలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు పిలుపునిచ్చిన నేపథ్యంలో దాతలు ముందుకు వచ్చారు. పలువురు మంగళవారం ఠాణాలో ఎస్‌ఐ శ్రీకాంత్‌కు విరాళంగా రూ.67 వేలు అందజేశారు. దాతల వివరాలు.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి రూ.50వేలు, నాయకులు రేణురెడ్డి రూ.10వేలు, శంకర్ నాయక్ రూ.5వేలు, రాజేందర్ నాయక్ రూ.2వేలు కలిపి మొత్తం నగదును ఎస్‌ఐకి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, డీసీసీ జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, సోషల్ మీడియా తాలూకా ఇన్‌చార్జి అజీం, మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు ఆరీఫ్, ఎంపీపీ మాజీ సభ్యురాలు లక్ష్మీదేవి రఘురాం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, యాదయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ధర్నాలో మాట్లాడుతున్న వెంకటయ్య

ఆమనగల్లు: రైతు, కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కానుగుల వెంకటయ్య డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని జాతీయ రహదారిపై సీఐటీయూ రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పంటలకు మద్దతు ధర ఇవ్వాలని కోరారు. రైతులకు పంటబీమా అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు శివశంకర్, పోచయ్య, శంకర్, పవన్, సురేందర్, జహంగీర్, రాములు, హంసమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి

ఆమనగల్లు: దేవాలయాలు, మసీదులు, చర్చీల వద్ద భద్రతా చర్యల్లో భాగంగా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ ప్రమోద్‌కుమార్ సూచించారు. మంగళవారం ఠాణాలో ఆలయాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల చోటు చేసుకుంటున్న సంఘటనల నేపథ్యంలో అన్ని ప్రార్థనాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఏమైనా సంఘటనలు, అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్, స్థానికులు రాము, వెంకటయ్య, మైసయ్య, యాదయ్య, శంకర్, బాలకృష్ణ, శ్రీనునాయక్, ఖాదర్, రహీం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం దేశానికే దిక్సూచి

'భారత రాజ్యాంగం దేశానికే దిక్సూచి. సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య భావనలో పౌరులందరికీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను ప్రసాదించింది. ఏ చట్టమైనా రాజ్యంగానికి లోబడి ఉంటుంది' అని వక్తలు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఇబ్రహీంపట్నం రూరల్: పోచారంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

పౌరులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ప్రసాదించింది

- అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- రాజ్యాంగ దినోత్సవంలో వక్తలు

ఇబ్రహీంపట్నం రూరల్: 'రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పుణ్యమని మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నాం. ఆయన రచించిన రాజ్యాంగం నాటి నుంచి బడుగు బలహీన వర్గాలకు దిక్సూచిగా మారింది' అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధి పోచారంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. విదేశాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలను ఆవిష్కరిస్తున్నారంటే.. అది ఆయన చూపిన మార్గమేనని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, ఎంపీపీ మాజీ సభ్యుడు కృపేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, ఈసీ శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ, బీఎస్పీ పార్టీల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు ప్రతాప్, ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యదర్శి రమేష్, నాయకులు పురుషోత్తం, శ్రావణ్ కుమార్ గౌడ్, కార్తీక్ గౌడ్, బీఎస్పీ మున్సిపాలిటీ అధ్యక్షుడు రమేష్ కురుమ, ఉపాధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ్మ అన్నారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని ప్రతిపాదించారు. తిరిగి 1950 నవంబర్ 26న ఆమోదించారు. రాజ్యాంగం అమలు జరిగిన రోజును (రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు) పురస్కరించుకొని మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ్మ, మాజీ సర్పంచ్ లలిత, మల్లేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి విద్యార్థులు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరావు, అధ్యాపకులు రవికుమార్, కృష్ణ, రాకేష్, రచన, కరుణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భూపతిరాజు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: రాజ్యంగ దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయులు, తలకొండపల్లి మండల అధ్యక్షుడు పవన్, నాయకులు శ్రీశైలం, మల్లేశ్, రాజు, దేవేందర్, కృష్ణ, రామలింగం, విజయ్, వెంకట్, రాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో కీలకం

కడ్తాల్: 'దేశాభివృద్ధిలో రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తుంది. భారత ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన ఘనత భారత రాజ్యాంగానికే దక్కుతుంది. అది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పుణ్యమే' అని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులులర్పించారు. అనంతరం రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కాపాడుకుందామని ప్రతిజ్ఞ చేశారు.



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు



తుర్కయంజాల్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



తలకొండపల్లిలో..



ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



ఆమనగల్లులో..

దళారులను నమ్మి మోసపోవద్దు

- రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- ఏడీఏ ఆదిలక్ష్మి

కడ్తాల్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని వ్యవసాయ శాఖ డివిజన్ అధికారి(ఏడీఏ) ఆదిలక్ష్మి సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ, ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వడంతో పాటు సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని వెల్లడించారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకుని, తేమ శాతం17 లోపు ఉండే విధంగా చూసుకోవాలని, తాలు, మట్టి పెల్లలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు దిగుబడిని తీసుకు రావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఏఈఓలు రమేశ్, అభినవ్, అనూష, వందన, పీఏసీఎస్ ఇన్‌చార్జి జగదీశ్ ఉన్నారు.

మా ప్లాట్లు ఇప్పించండి..

- పిగ్లీపూర్ భూ బాధితుల ఆందోళన
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



నిరసన వ్యక్తంచేస్తున్న భూ బాధితులు

అబ్దుల్లాపూర్‌మెట్: తమ ప్లాట్లు అన్యాక్రాంతం అయ్యాయని నాగేశ్వర హౌసింగ్ సొసైటీ ఫేజ్–2, నవదుర్గానగర్ ఫేజ్ 1,2 వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన పలువురు బాధితులు ఆదోళన వ్యక్తం చేశారు. హద్దురాళ్లు మాయమై.. ప్లాట్లన్నీ కనుమరుగయ్యాయని వాపోయారు. సర్వే చేసి తమ ప్లాట్లకు ప్రహరీ నిర్మించాలని కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లాట్ల యజమానులు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 12/7, 12/8, 12/9, 17/1/ఏలలో 35 ఏళ్ల క్రితం నాగేశ్వర హౌసింగ్ డెవలప్‌మెంట్ పేరుతో ఎస్వీఎస్ నాయుడు వెంచర్ వేశారని తెలిపారు. అందులో సుమారు 1300మంది ప్లాట్లు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఆ ప్లాట్లపై హక్కులు దక్కించుకోవడానికి తామంతా అసోసియేషన్‌గా ఏర్పడి పోరాడుతూనే ఉన్నామని వెల్లడించారు. కాగా ఈ ప్లాట్లను కొందరు ఆక్రమించుకుని ఆనవాళ్లు లేకుండా చేశారని ఆరోపించారు. ఇదే విషయమై కోర్టుకు వెళ్లగా ప్లాట్ల యజమానులమైన తమకే అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. కోర్టు ఉత్తర్వులు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా.. తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు భూమిని సర్వే చేయించి, న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. దీనికి స్పందించిన ఆయన.. ప్లాట్లను ఆక్రమించిన వారికి అక్కడ చేపట్టిన పనులను నిలిపివేయాలని ఆదేశించినట్లు బాధితులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగభూషణం, ప్రధాన కార్యదర్శి జయంత్, సంయుక్త కార్యదర్శి శివరామకృష్ణలు, ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

పలువురికి కంటి ఆపరేషన్



ఆపరేషన్ చేయించుకున్నవారితో సభ్యులు

ఆమనగల్లు: వారం రోజులుగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో ఇప్పటివరకు 119 మందికి కంటి ఆపరేషన్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. శంకర నేత్రాలయ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 4500 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. ఇందులో 160 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేశామని, ఇప్పటివరకు 119 మందికి ఆపరేషన్ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, చంద్రశేఖర్, శ్రీను, కొండల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న ఓటరు తుది జాబితా



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ఓటరు తుది జాబితా ఈ నెల 30న గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ జాబితాలో మార్పులు చేర్పుల గురించి వివిధ రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించారు. పలు గ్రామాల లిస్టులో సవరణలు చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

పింఛన్‌కోసం వృద్ధుల పడిగాపులు



తపాలా కార్యాలయం వద్ద వృద్ధుల నిరీక్షణ

యాచారం: ఏ ఆసరా లేని వృద్ధులు.. ప్రభుత్వం అందజేసే పింఛన్ కోసం తపాలా కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. మండల పరిధి నక్కర్తమేడిపల్లి గ్రామంలో మంగళవారం పింఛన్ డబ్బుల కోసం వయోజనులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక పాఠశాలలో కొనసాగుతున్న పోస్టాఫీస్ వద్ద వేచి చూశారు. ఎంతకీ కార్యాలయం తలుపులు తెరచుకోకపోవడంతో.. కొందరు సంబంధిత అధికారికి ఫోన్ చేయగా.. సాంకేతిక లోపంతో యంత్రం పనిచేయడం లేదని పేర్కొన్నారు. దీంతో లబ్ధిదారులు మండల కేంద్రంలోని తపాలా కార్యాలయానికి బస్సులు, ఆటోల్లో తరలివెళ్లారు. అక్కడా ఇదే సమస్య తలెత్తడంతో నిరాశతో ఇంటిబాట పట్టారు.

పల్లెల్లో పనుల జాతర

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తికావస్తున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలకు సర్కారు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ముందస్తుగా మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మనఊరిలో పనుల జాతరను అధికారులు, పాలకులు ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పండ్ల తోటలు, తదితర పంటలపై ఆ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.



కడ్తాల్: తోటల పెంపకం పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సుజాత తదితరులు

- పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- పండ్ల తోటల సాగులో రైతులకు అవగాహన
- జీపీ సిబ్బంది, ఉపాధి కూలీలకు సన్మానం

కడ్తాల్: పండ్ల తోటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తుందని ఎంపీడీఓ సుజాత అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మనఊరిలో పనుల జాతరను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి పథకంలో పశువుల షెడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, పాంపాడ్స్ నిర్మాణం, భూమిని చదును చేయుట, వర్మి కంపోస్ట్ పిట్, ఇంకుడు గుంతలు తదితర నిర్మాణం పనులు చేపట్టాలనుకున్న రైతులు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు మల్లేశ్‌గౌడ్, జహంగీర్‌అలీ, రాంచందర్‌నాయక్, జీపీ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో గ్రామాలకు మహర్దశ

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పాలనలో గ్రామాలకు మహర్దశ పట్టుకుటుందని ఆ పార్టీ ఇబ్రహీంపట్నం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోదూరి రమేష్ అన్నారు. మండల పరిధి తులేకలాన్ గ్రామంలో ప్రజాపాలన విజయోత్సవ వేడుకల్లో భాగంగా రూ.20 లక్షల ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో గ్రామాల రూపురేఖలు మారతాయని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శశాంక్‌రెడ్డి, సాయిలు, కష్ణ, మహేందర్, తిరుమల్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, కిషన్‌రెడ్డి, పండు, నర్సింహ, ప్రభు, శివ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: ప్రజాపాలన–ప్రజా విజయోత్సవం, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పలు గ్రామాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో మనఊరిలో పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అమృత్ సరోవర్ చెరువుల వద్ద మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధికూలీలు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అత్యధిక ఉపాధి పనులు పూర్తి చేసుకున్న కూలీలకు, పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు



యాచారం: మల్కీజ్‌గూడలో.. చెరువు వద్ద

పత్తి కొనుగోలు కేంద్రం పరిశీలన

ఆమనగల్లు: మండల పరిధి ఆకుతోటపల్లి కాటన్‌మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి అరుణ కుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఎండబెట్టిన పత్తిని కేంద్రానికి తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు జ్యోత్స్న, వాహిని, సీసీఐ అధికారి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

'ఉపాధి'ని వినియోగించుకోండి

మాడ్గుల: ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. మంగళవారం మండల పరిధి అవురుపల్లి, నల్లాచెరువు గ్రామాల్లో ఉపాధి పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఏఐసీసీ కార్యదర్శికి సన్మానం

తలకొండపల్లి: ఏఐసీసీ కార్యదర్శి, సిడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్ రెడ్డిని ఆమనగల్లు మార్కెట్ డైరెక్టర్ అజీం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

కడ్తాల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ధ్యేయమని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలో ఇటీవల మృతి చెందిన, బాబ్రీ, కేశని సత్యమ్మ, సందీప్‌రెడ్డి, ఇస్లావత్ శ్రావ్య తదితర కుటుంబాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన మంగళవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, నర్సింహ, రాములునాయక్, మహేశ్, యాదగిరిరెడ్డి, ఇర్షాద్, కుమార్, యాదయ్య, శ్రీను, వెంకటేశ్, జగన్, యాదయ్య ఉన్నారు.

వార్డు మాజీ సభ్యురాలి కుటుంబానికి

మండల కేంద్రానికి చెందిన వార్డు మాజీ సభ్యురాలు కేశని సత్యమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో స్థానిక నాయకులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామాభివృద్ధికి సత్యమ్మ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబీకులకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ రూ.5 వేలు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5 వేలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేలు, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ రూ.3 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.